# సర్పదష్ట

చదువుతున్న పుస్తకాన్ని ఉన్నట్లుండి మూసేశాడు రంగారావు.

'ప్రపంచంలో విజ్ఞానం ఎంత ముందుకు పోతున్నా -- ఈ మనస్సనేదాన్ని అర్థం చేసుకోవడం ఎప్పటికీ జరగదనిపిస్తోంది నాకు రాణీ!'

భర్త సరసనే మంచం మీద కూర్చుని లేసు అల్లుతూన్న సునంద ఉలిక్కిపడి 'ఏమిటన్నారూ?' అంది.

'అదే -- మనస్తత్వం విజ్ఞానానికి అందదంటున్నాను -- ఈ పుస్తకంలో రాసిన వింత చూడు -- వో జాలరివాడు చేపల్ని పట్టి బుట్టలో వేసుకుంటూ వో పామును కూడా బుట్టలో పడేశాట్ట. కానీ ఆ సంగతి అతనికీ తెలియదు. ఇంటి కెళ్లాక అతని తల్లి బుట్ట బోర్లించేసరికి అందులోంచి పాము క్రిందపడి పాక్కుంటూ వెళ్లిపోయిందట. వెంటనే ఆవిడ కంగారుపడి కొడుకు దగ్గరకెళ్లి ఈ విషయం చెప్పిందట. విషయం వింటూనే అతడు విరుచుకుని క్రిందపడిపోయాట్ట. డాక్టర్ని తీసుకొచ్చేలోగానే అతడు చచ్చిపోయాడు. పరీక్షలో అతని మరణానికి కారణం పాము కాటని తేలింది--'.

'చిత్రంగా ఉందే?'--

'అక్కడే ఉంది తమాషా! అతన్ని పాము కరిచి చాలాసేపయినా -- ఆ విషయం తెలిసేదాకా అతని మీద విషం ప్రభావం చూపించలేదు. అతన్ని చంపింది విషం కాదు -- అతని మనసే.....'

సునంద నవ్వింది, 'ఇలాంటి వింతలు పుస్తకాల్లోనూ, పేపర్లలోనూ చదవడమే కానీ -- ఎప్పుడూ ఎవరికీ అనుభవంలోకి వచ్చినట్లు నేను వినలేదు. ప్రతివారూ మరొకడి అనుభవం గురించి ఉదాహరణివ్వడమేగానీ -- స్వంత అనుభవాలను గురించి చెప్పడం...'

'నాకు తెలుసు నువ్విలా అంటావని -- అయినా ప్రపంచంలో వింతలున్నాయని నేను మాత్రం నమ్ముతాను రాణీ!' అన్నాడు రంగారావు.

'ఎందుకు లేవు? ఉదాహరణకి మనం చూద్దామనుకుంటున్న సినిమా విషయం చూడండి. ఇదిగో అదుగో అంటూ నూర్రోజులు గడిచిపోయాయి. రేపటితో అఖరంటున్నారు. ఈ మధ్యలో మనం బోల్డు సినిమాలు చూశాంగానీ -- అదిమాత్రం చూడలేకపోయాం -- వింత కాదూ...'

రంగారావు ఒక్క క్షణం మౌనం వహించి 'ఏమైనా -- రేపు ఫస్టుషోకి మనం ఆ సినిమాకి వెళ్లి తీరుదాం!' అన్నాడు.

ప్రజల్లో గొప్ప సంచలనాన్ని కలిగించిన ఆ చిత్రాన్ని చూడలేక పోయిన దురదృష్టవంతురాలు, ఒక్క సునంద మాత్రమేనని -- సునంద యొక్క అభిప్రాయం.

అంత గొప్ప చిత్రాన్ని ఇద్దరూ కలిసి చూడాలని ఉద్దేశ్య పడడంవల్లనూ, ఆ చిత్రం నడుస్తూన్న థియేటరు ఊరికి మూలగా ఉన్నందువల్లనూ, ఆ చిత్రం చూడాలనుకున్న రోజునే చుట్టాలు రావడం, రంగారావుకి ఆఫీసులో ఎక్కువ పనుండడం వంటి అడ్డంకుల వల్లనూ నూర్రోజులదాకా వారి కార్యక్రమం వాయిదా పడిపోయింది. ఈ మధ్యకాలంలో ఓ ఆఫీసరుగారికి ట్రాన్స్ఫరయిన సందర్భంలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఓ భాగంగా -- రంగారావు ఆ చిత్రాన్ని చూసేశాడు, అతనికీ ఆ చిత్రం నచ్చడంవల్ల -- ఇరుగు పొరుగు ఆడవారెవరయినా ఉంటే కలిసి వెళ్లమని భార్యకు సలహా ఇచ్చాడు. కానీ అంత మంచి చిత్రాన్ని అంత కాలంపాటు చూడకుండా ఆగిన ఇరుగు పొరుగు ఆడవారెవరూ ఆమెకు లభించలేదు.

ఇంతకీ అసలు సమస్య ఏమిటంటే సునందకు ఒంటరిగా సినిమాకి వెళ్లడమంటే భయం. ఆ భయానికి ముఖ్యమైన కారణాలు రెండే రెండు -- ఒకటి అద్భుతమైన ఆమె సౌందర్యం, రెండు సున్నితమైన ఆమె మనస్తత్వం.

ఆమె అందాన్ని గురించి ఒకే ఒక్క ముక్కలో చెప్పాలంటే -- సుప్రసిద్ధ సినీ తారలు మేకప్‌లో ఉన్నప్పుడుకూడా -- సునంద మామూలుగా ఉన్నప్పుడంత సుందరంగా కనిపించరు. ఆమె మనస్సెంత సున్నితమో చెప్పాలంటే -- విద్యార్థుల గొడవ భరించలేక ఆమె సగంలో కాలేజీ చదువు మానేసి పెళ్లికి సిద్ధపడింది.

సునంద భర్త రంగారావు మరీ అంత అందగాడు కాకపోయినా -- కాకి ముక్కుకి

దొండపండు సామెతకు ఉదాహరణలా మాత్రం ఉండడు. అదీకాక అతని హృదయమెంతో విశాలమైనదని గుర్తించింది సునంద. అతనికి భార్యతోడిదే లోకం. నిజానికి చాలా మంది భర్తలు సౌందర్యవతి అయిన భార్యను అనుభవించడంలో కంటే అనుమానించడంలోనే ఎక్కువ కాలం గడుపుతారు. కానీ రంగారావు ఇందుకు భిన్నం. అందుకే సునంద తన అదృష్టాన్ని పొగుడుకునేది. ఎవరయినా తోటి స్త్రీలు తన అందం ప్రసక్తి తెచ్చినప్పుడు -- 'ఆడదాని అదృష్టం అందంలో లేదండీ -- అనుకూలుడైన భర్తలో ఉంది. నా అసలు అదృష్టమదే!' అనేది.

ఏమైనప్పటికీ సునందకు భర్తతో తప్ప బయటకు వెళ్లడానికి భయంగా ఉండేది. ఆమె బయటకు వస్తే చాలు -- వేల కొద్దీ మగవాళ్ళ చూపులు బాణాల్లా ఆమె శరీరానికి గుచ్చుకునేవి. ఈ విషయంలో కొంత తప్పు తన అందాన్ని గుర్తించిన సునందలో కూడా లేకపోలేదు. తన వైపు చూసే ప్రతి మాగవాడి కళ్లలోనూ ఆకలిని ఊహించుకోవడం ఆమె పొరబాటే!

అయితే సత్యానందం విషయంలో ఆమె పొరబడలేదు. ఒకవేళ ఆమె నిజంగా పొరబడిఉన్నా సత్యానందాన్నెరిగున్న వాళ్లెవరూకూడా ఆమె పొరబడిందనరు.

సత్యానందానికి అందం ఉంది. అందంగా ఉన్నానన్న గర్వం ఉంది. ఐశ్వర్యం ఉంది. అందుకు తగ్గ అతిశయం ఉంది. వయస్సు ఉంది. ఏ ఆడదాన్నైనా లొంగదీసుకోగలనన్న నమ్మకమూ ఉంది. కొత్త అనుభవాలు కోరే మనస్సు ఉంది. అనుభవాలు తీరే ప్రదేశాలతో పరిచయం ఉంది. అన్నింటికీ మించిన అహం కారమూ, అవసరాన్నిబట్టి ఏమైనా చేయగల క్రౌర్యమూ కూడా ఉన్నాయి. అతనికి లేనివల్లా ఆత్మ సౌందర్యమూ, తలిదండ్రుల ప్రేమా మాత్రమే.

ఈ సత్యానందం చేతిలో అనేకమంది పడుచులు నలిగిపోయారు. కొంతమంది డబ్బు కోసం కావాలని నలిగితే, మరికొంతమంది అక్రమంగా నలిగిపోయారు. అతని తృష్ణ అలాంటిది. ఈ సత్యానందం మహాశయుడి కెదురింట్లోనే సునంద ఉంటోంది.

సునందను మొదటిసారి చూసినపుడే సత్యానందానికి నోరూరింది. అంతలోనే అలాంటి దేవత రంగారావు వంటి ఒక అనామకుడితో ఉంటోందన్న బాధ కూడా కలిగింది. తను ఇంతకాలం చూసిన రుచులు వేరనీ -- సునంద తన కోసం ప్రత్యేకంగా భగవంతుడిచే సృష్టించబడిందనీ అతను గ్రహించాడు. అంతేకాక -- ఏదో తప్పక కాపురం చేస్తోంది. కానీ రంగారావంటే ఆమె కిష్టంలేదనీ -- తన వంటి అందగాడి కోసమే ఆమె ఎదురు చూస్తూండ వచ్చుననీకూడా అతనికి తోచింది. ఇటువంటి ఆలోచనలు రావడం అతనికి కొత్త కాదు.

అయితే సునందకివన్నీ తెలియవు. చుట్టుపక్కల ఆడవాళ్ల ద్వారా అతన్ని గురించి మంచిగానే వింది. సాధారణంగా చాలా మంది ఆడవాళ్లు అందమైన మగవాళ్లని ఎంతో మంచివాళ్లు అని ఊహించుకుంటారు. అసలు సంగతి తెలిసిన వాళ్లొకరిద్దరున్నా -- ఎలా తెలిసిందని నిలదీసేవాళ్లకు చెప్పడం చేతగాక మంచిగానే చెబుతారు.

కాబట్టి సునంద సత్యానందం మంచివాడనే అనుకుంది. అతను తన భర్తతో

క్రమంగా పరిచయం పెంచడం చూసి -- అంత భాగ్యవంతుడు మాతో ఎంత బాగా ఉంటున్నాడూ అని సంబరపడేది. సత్యానందం తెప్పించని పుస్తకాలు లేవు. అసలు ఆడవాళ్లతో పరిచయం సంపాదించడానికి పుస్తకాలొక మూలసాధనమని తెలుసునతనికి. ఉదయం పది గంటలనుంచి సాయంత్రం మూడింటివరకూ తీరుబడిగా గడిపే ఆడవాళ్లందరికీ పుస్తకాలు గొప్ప కాలక్షేపం. సునందక్కూడా పుస్తకాల పిచ్చి ఉండడంతో -- సత్యానందం 'పిట్ట దారిలో పడ్డానికి ఎంతో కాలం పట్టదు!' అనుకున్నాడు.

అయితే పుస్తకాల కోసం సునంద తనకి తానుగా సత్యానందం ఇంటికి వెళ్లలేదు. పనిమనిషిని పంపించి పుస్తకాలు తెప్పించుకునేది. మొదట్లో సత్యానందం మంచి పుస్తకాలే ఇచ్చాడుగానీ ఓ వారం పది రోజుల తర్వాత ఓ కొత్త తరహా పుస్తకాన్ని పంపాడు. పుస్తకం పేరునీ, అట్టమీది బొమ్మనీ చూసిన సునంద అది ఎటువంటి కథల పుస్తకమో గ్రహించింది. కానీ ఉబలాటంకొద్దీ చదివింది ఓ మూడు కథలు. కథలు మనిషిని బాగా రెచ్చగొట్టేవిగా ఉన్నాయి. అన్నింటిలోనూ ఒక్కటే కథా వస్తువు. పనిమనిషిని పిల్చి -- 'ఇలాంటి పుస్తకాలు -- ఎప్పుడూ ఇవ్వవద్దు, అమ్మగారు చదవరు -- మంచి పుస్తకాలుంటే ఇమ్మన్నారు -- అని చెప్పు' అంది.

అలా అంది కానీ ఆమెకు ఆ క్షణంలోనే సత్యానందం మీద అనుమానం కలిగింది. పనిమనిషికేమైనా దురుద్దేశ్యం లేదుగదా అనుకుంది. ఏ విషయమూ భర్తకు చెప్పలేదు. తర్వాత నించి సత్యానందం మంచి పుస్తకాలే పంపిస్తూన్నప్పటికీ - ఆమెకు ఏర్పడ్డ అనుమానం మాత్రం పోలేదు. సత్యానందాన్ని ఓ కంట పరీక్షించడం మొదలెట్టింది.

ఈ విషయం సత్యానందం కనిపెట్టాడు. అసలామె తననలా పరీక్షించాలనే, అతని ఉద్దేశ్యం. ఆ పరీక్షలో తనకు తెలియకుండానే ఆమె తన అందాన్ని గుర్తించడం జరగొచ్చు. అతనికి ఆడవాళ్లను వెర్రెత్తించేసేలా నవ్వడం చేతవును. అమాయకంగా ముఖం పెట్టడం చేతవును. ఆమె పరీక్ష ప్రారంభించినప్పట్నించీ అతను మరింత అందంగా తయారయి -- ఆకర్షణీయంగా కనిపించడానికి ప్రయత్నాలు చేయడం మొదలెట్టాడు.

అయితే సునంద దృష్టి -- అతననుకున్న రీతిగా ప్రసరించలేదు. పరీక్ష ద్వారా -- అతనికి తన మీద దురుద్దేశ్యముందని ఆమె నిర్ణయించుకుంది. అతని అందం ఆమెపైన ఎటువంటి ప్రభావమూ చూపలేకపోయింది. సునంద నించి తనకు కావలసిన సైగలను రప్పించుకోవడం కోసం అతను చాలా కాలం విసుగూ విరామం లేకుండా ఎదురు చూశాడు. కానీ అతనికి ఎదురయింది నిరాశ మాత్రమే! ఆ నిరాశ అతన్ని కృంగదీయ సాగింది. తనకలా ఎన్నడూ జరగలేదే అని ఆలోచించిన సత్యానందానికి హఠాత్తుగా ఓ విషయం స్ఫురించింది. సునంద అందానికి దేవకన్యలా ఉంటుంది. ఆ అందానికి తగ్గ అహంకారమూ ఆమె కుండి ఉంటుంది. తన అందానికి పురుషుడు దాసోహమనాలి గానీ -- పురుషుడి అందానికి తను దాసోహమనడమేమిటని ఆమె అనుకుని ఉంటుంది. అందుకే ఆమె కర్తవ్యభారాన్ని తనకే వదిలి - తననించి ముందుగా చొరవ వస్తుందని ఎదురు చూస్తూండి ఉంటుంది.

ఈ విషయం స్ఫురించగానే సత్యానందానికి ఇంతకాలం తను ఈ సంగతి గ్రహించక పోయినందుకు బాధ కలిగింది. ఇన్నాళ్లూ తన్ను సరిగా అర్థం చేసుకోనందుకు సునంద ఎంత బాధపడి ఉంటుందో. తను వెంటనే చొరవ తీసుకుని సునందకు బాధోపశమనం కలిగించాలని అనుకున్నాడతను. చొరవ ఎలా తీసుకోవాలో అతను ఎక్కువగా ఆలోచించలేదు. ఇటువంటి చొరవలు ఇదివరలో ఒకటి రెండుసార్లు అతను తీసుకుని ఉన్నాడు. వెంటనే ఓ ప్రేమలేఖ తయారు చేసి -- ఓ పుస్తకంలో పెట్టి మర్నాడు మధ్యాహ్నం ఆమెకు పంపించాడు.

సత్యానందం లేఖ రాసేవరకూ తెగిస్తాడని ఊహించని సునందకు ఆ లేఖ చూసేసరికి ఒక్కసారిగా ఒళ్లుడికి పోయింది. ఇంక ఉపేక్షించకూడదనీ భర్తకు ఈ విషయం తక్షణం తెలియబర్చాలనీ అనిపించింది. కానీ సత్యానందం చేసిన తప్పుకు అది తగనిశిక్ష అనిపించిందామెకు. అతడు జీవితమంతా మరిచిపోలేని పరాభవం చేయాలని అనుకుందామె. ఒక్క నిముషం ఆలోచించి వెంటనే అతనికో ఉత్తరం రాసి పుస్తకంలో పెట్టి తిరిగి పంపించేసింది.

సత్యానందం సునంద జవాబు చూసుకుని మురిసి పోయాడు. తను తీసుకున్న చొరవ వల్ల తను కన్న కలలన్నీ ఫలించినాయని అతను సంబరపడిపోయి తన్ను తానభినందించుకున్నాడు. తన అందానికి ఎటువంటి స్త్రీ అయినా దాసోహమని తీరవలసిందేనని ఈ దెబ్బతో ఋజువయిపోయిందనుకున్నాడు. అతన్ని అజంతా హోటలుకి రమ్మని రాసిందామె. వెంటనే అతను ట్రిమ్‌గా తయారయి హోటల్ చేరుకున్నాడు.

అతనక్కడ సరిగా ఒక గంటసేపు ఎదురు చూశాడు. ఇంక చిరాకు అతనిలో ప్రవేశించ బోతూండగా మెరుపుతీగలా సునంద వచ్చింది. హోటల్లో చాలా మంది కళ్లు ఆమె వైపు తిరిగాయి. అప్పుడు టైము మధ్యాహ్నం మూడున్నరవుతుంది.

సత్యానందం ఓ అడుగు ముందుకు వేసి --- 'హల్లో -- సునందారాణీ -- అన్న ప్రకారం వచ్చేశారే!' అంటూ ఆమెను కలుసుకుని కరచాలనం చెయ్యబోయాడు. సునంద రెండు క్షణాలు అతని వంక తీవ్రంగా చూసి ఉన్నట్లుండి ఎడమ చేత్తో సాచి లెంపకాయ కొట్టింది. వెంటనే వెనుదిరిగి హోటల్ బయటికి వెళ్లి ముందుగా చెప్పి ఉంచుకున్న టాక్సీలో వెళ్లి పోయింది.

సత్యానందం ఒక్క క్షణం మ్రాన్పడి పోయాడు. హోటల్లో అంతా అతని వంక అదోలా ఆశ్చర్యంగా చూడ్డం చూసి సిగ్గుపడిపోయి-బయటకు వచ్చేశాడు.

సునంద కొట్టిన దెబ్బ అతని చెంపకు కాదు -- అహానికి తగిలింది! సాటిలేని తన సౌందర్యానికి స్త్రీ లోకమంతా దాసోహం చేస్తుందనుకున్న అతని దృఢ విశ్వాసానికి తగిలింది. ఆ దెబ్బ అంత సులువుగా మానదు -- పగ తీర్చుకోవాలి...

ఆ సాయంత్రం భార్య నోటి ద్వారా ఈ సంగతి విన్న రంగారావుకు నవ్వాగలేదు. 'అజంతాలో ఎవరో అమ్మాయి సత్యానందాన్ని కొట్టిందని చెప్పుకుంటున్నార్లే - అది నువ్వేసన్నమాట!' అంటూ రంగారావు మళ్లీ పగలబడి నవ్వాడు.

సత్యానందం పేరు నవ్వులపాలయింది. ఇంత దారుణంగా పది మందిలో అతనెన్నడూ అపహాస్యంపాలు కాలేదు. అయితే సునందను ఈ విషయంలో అభినందించడం కష్టం! నాగుపాము నుండి తప్పించుకోవడానికి బదులు -- దానితో చెలగాటమాడింది ఆమె -- పగబట్టిన పాము ఆమెను కాటేయక మానుతుందా?

రంగారావు కూడా అదే అన్నాడామెతో -- 'నువ్వు సత్యానందానికి విధించినది - తగిన శిక్షే అయినప్పటికీ కాస్త సౌమ్యంగా మందలించి ఉంటేనే బాగుండేదేమో!' అన్నాడతను.

అందుకు సునంద జవాబిచ్చింది -- 'మీ రేమన్నా సరే నేనొప్పుకోను. వాడికా శిక్ష కావాలి! వివాహితను, స్నేహితుడి భార్యన్న జంకైనా లేకుండా -- వాంఛించిన వ్యక్తికి నేను విధించినది చాలా చిన్నశిక్ష మాత్రమే. మనిషికి శీలం ముఖ్యం. దాని ప్రాముఖ్యతను గుర్తించని వాళ్లు వెధవలు. అందం, డబ్బూ అతి వినయాల వెనకాల అవలక్షణాలను దాచుకునే వెధవలంటే నాకు పరమ అసహ్యం!'.

ఆమె అంత తీవ్రంగా మాట్లాడేసరికి రంగారావు మొహం వెల వెల బోయింది. అతను చటుక్కున ఆమె రెండు చేతులూ పట్టుకుని -- 'రాణీ! ఇక శాంతించు -- నీ సౌందర్యం ఇంతలా వెలిగిపోడానిక్కారణం నీ ఆత్మ సౌందర్యమేనని ఈ రోజు గ్రహించాను. నీ ఆవేశం కొంచెం తగ్గించుకుని చెడ్డవాళ్లని క్షమించడం కూడా నేర్చుకో - ఎప్పుడయినా నీ భర్త తప్పటడుగు వేస్తే క్షమించడానికి పనికొస్తుంది' అన్నాడు.

సునంద ఆప్యాయంగా భర్త వంక చూసింది. 'మీరా -- తప్పటడుగు వేయడమా? జన్మలో జరగదు. మీమీద నాకానమ్మకముంది. ఒకవేళ మీరే తప్పటడుగు వేస్తే అందుకు నేనే కారణమవుతాను. అప్పుడు నేను జీవించడమే వృథా అవుతుంది. ఊహలో కూడా నేనది భరించలేను. ఇంకెప్పుడూ అలా మాట్లాడకండి' - అందామె.

రంగారావు ఆమె వంక ప్రేమతో చూశాడు. అప్పుడు సునంద మళ్లీ అంది 'సత్యానందానికి ఇంకా శిక్ష పూర్తి కాలేదు. ఈ విషయాలేమీ తెలీనట్లుగా మీరు వాడితో ఎప్పటిలా మాట్లాడుతూండడమే వాడికి మిగిలిన శిక్ష!'.

ఒంటరిగా బయల్దేరాలనుకున్నప్పుడల్లా సునంద కింత కథ గుర్తుకొస్తుంది. అందువల్లనే ఆమె ఊరికి మూలగా ఉన్న ఆ సినిమాకి ఒంటరిగా వెళ్లలేకపోయింది. కానీ ఆ రోజు కిక తప్పదేమో ననిపించిదామెకు. ఎందుకంటే అనుకోని కారణాలవల్ల రంగారావు ఆ రోజు సాయంత్రం ఆఫీసులోనే వుండిపోవలసివచ్చిందనీ, వచ్చేసరికి బాగా రాత్రి కావచ్చుననీ - తన కోసం ఎదురుచూడక సునందను సినిమాకు వెళ్లమనీ ఉత్తరమొకటి ఆఫీసు ప్యూన్ ద్వారా పంపించాడు.

సినిమా చూడాలన్న కాంక్ష బలంగా ఉండడంవల్ల ఆమె చివరికి ఒంటరిగానే సినిమాకి బయల్దేరింది.

సునంద ఇంటికి తాళం వేసి దిగుతూంటే ఎదురుగా ఇంటికి తాళం వేస్తూవున్న సత్యానందం కనిపించాడు. ఆమె బస్ స్టాప్ చేరుకునేసరికి సరిగ్గా సిటీ బస్ వచ్చింది. ఆమె

బస్ ఎక్కి ముందు సీటులో కూర్చోబోతూ అనుకోకుండానే వెనక సీట్లో కూర్చోబోతూ ఆగిపోయిన సత్యానందాన్ని చూసింది. ఆమెను చూస్తూనే సత్యానందం ముందుకు వచ్చి సరిగ్గా ఆమె వెనుకగా వున్న సీట్లోనే కూర్చున్నాడు.

'లక్ష్మీ టాకీస్' అంది సునంద కండక్టరుకి డబ్బులిస్తూ. మరో కొద్దిక్షణాలకే 'లక్ష్మీ టాకీస్!' అన్న సత్యానందం కంఠం భయంకరంగా వినిపించిదామెకు. ఎందుకో ఆమెకు భయం వేసింది. సినిమా మానేసి ఇంటికి పోదామా అని కూడా అనుకుందామె. అంతలోనే తన భయానికి అర్ధం లేదనుకుందామె. ఈ మహానగరంలో ఇంత మంది జనసమూహంలో అవమానంపాలు కాదలుచుకుంటేనే వీడు మళ్లీ నా జోలికి వస్తాడు - అనుకుందామె. అయినప్పటికీ ఆమె మనసుకి మాత్రం స్థిమితంగా లేదు.

టికెట్స్ చాలా సులభంగా దొరికాయి. సినిమా చాలా ఖాళీగా ఉంది. ఆమె టికెట్ తీసుకుని హాల్లో ప్రవేశించింది. ఓ పది నిముషాల అనంతరం సత్యానందం కూడా హాల్లో ప్రవేశించాడు. ఆమె అతనివంకే పరీక్షగా చూసింది. అతడు ఆమెను గమనించినట్లేలేదు. వెతుక్కుని ఆమెకు రెండు మూడు వరసలు ముందుగా కూర్చున్నాడు. పొరబాటునగానీ, హాలుని కలయజూసే వంకతోగానీ అతను సునంద వంక చూడలేదు. అయినా సునంద అతని గురించి ఆలోచించడం కానీ భయపడడం కానీ మానలేదు.

కొద్ది సేపట్లోనే దీపాలారిపోయాయి. ఏవో స్లైడ్సు వేశారు. న్యూస్‌రీలూ, కుటుంబ నియంత్రణ డాక్యుమెంటరీ అయిన అనంతరం సినిమా మెదలయింది. సినిమా మొదలయ్యేముందు ఆమె కలవరపడుతూ ఉన్నప్పటికీ - క్రమంగా కథలో మునిగిపోగలిగింది. సినిమా బాగుండడంవల్ల ఆమెను పూర్తిగా ఆకట్టుకోగలిగింది. ఇంటర్వల్‌లో కూడా సత్యానందం ఆమెను చూడలేదు. అతని ఈ ప్రశాంతత ఆమెకు మరింత అనుమానం కలిగించసాగింది. 'తుఫాను ముందరి ప్రశాంతత కాదుగదా ఇది' అని ఆమె భయపడసాగింది. మళ్లీ సినిమా ప్రారంభమయ్యాక ఆమె అన్నీ మరిచి పోయింది.

సినిమా చాలా పెద్దది. పూర్తయ్యేసరికి పదింపావయింది. ఆ సమయంలో సిటీ బస్సులేవీ ఉండవు. పోతే రిక్షాలో పోవాలి. సునంద హాలు బయటకొచ్చింది. సత్యానందం ఎప్పుడు వెళ్లిపోయాడో కానీ సినిమా ముగిసి దీపాలు వెలిగేసరికి మాత్రం హాల్లో లేడు.

ఆమెను చూస్తూనే ఒకరిద్దరు రిక్షా వాళ్లు ముందుకొచ్చారు. ఆమె తను వెళ్లవలసిన చోటు చెప్పింది. ఒకడు మూడున్నరడిగాడు, మరొకడు నాలుగన్నాడు. అక్కర్లేదని ఆమె ముందుకు నడిచింది. అంత ధర అడిగినందుకామె ఒళ్లు మండింది. 'ఏమిస్తారమ్మగారూ' - అన్నాడొకడు వెంటబడి - 'రెండ్రుపాయాలు' అంది. 'మరో అర్ధరూపాయిప్పించండమ్మగోరూ!' అన్నాడు వాడు. 'పైసాకూడా ఇవ్వను!' అందామె ఖచ్చితంగా, వాడో నిమిషం గొణుక్కుని - 'ఎలాగూ - నేనూ అక్కడికే పోవాలి - తిరుగుబేరమే కదా, సరే ఎక్కండి!' అన్నాడు.

సునంద రిక్షాలో కూర్చుని ఆలోచించసాగింది. చూడకపోతే నిజంగా తనొక గొప్ప చిత్రాన్నే మిస్సయుండేది. చాలా బాగుంది సినిమా. భర్త పక్కనుంటే ఇంకా బాగుండేది.

అంతలో ఆమెకు సత్యానందం గుర్తుకొచ్చాడు. తన్ను సినిమా దాకా వెంటాడిన సత్యానందం తర్వాత ఏమయ్యాడు? తనతో ఏకాంతం లభించే అవకాశాన్ని వదులుకుని కూడా ఎందుకు వెళ్లిపోయాడు?

కొంతసేపు ఆలోచించేక సునందకు సమాధానం తట్టింది. సత్యానందంలో ఆశ ఇంకా చావలేదు. తన వెంటబడి తిరుగుతూంటే ఎప్పుడో అప్పుడు తన మనస్సు మారకపోతుందా అనుకుంటున్నాడు. కానీ తనంత తానుగా చొరవ తీసుకోవడానికి భయపడుతున్నాడు, పాపం!

సత్యానందం మీద ఆమెకు కొద్ది క్షణాల సేపు జాలి కలిగి అంతలోనే ఆమె మనస్సు మళ్ళీ కఠినంగా అయిపోయింది. వివాహితురాలైన తన్ను నిత్యమూ అదే దృష్టితో చూసే ఓ యువకుడుండడం ఆమెకు ముళ్ళు గుచ్చుకున్నట్లనిపించింది. 'ఛీ... ఏం మనిషి!' అనుకుంది. ఆలా అనుకుంటూ ఆమె పరిసరాలనొకసారి పరికించింది.

రిక్షా వెడుతున్న వీధి కొత్తగా అగుపించింది. రోడ్డు మీద చెప్పుకోదగ్గ జనసంచారం లేదు. ఎందుకో ఆమెకు అనుమానమూ, భయమూ కలిగాయి. కంగారును కప్పి పుచ్చుకుంటూ --'ఇదేదో కొత్త దారిలాగా వుందే?' అంది. 'అవునండి!' అంటూ రిక్షావాడు మామూలుగా తొక్కుకు పోసాగాడు.

ఊరికే ఏదో అనుమానంవచ్చి సునంద వెనక్కు చూసింది. వెనకాలే మరొక రిక్షా వస్తోంది. అందులో ఒక పురుషుడున్నట్లు తెలుస్తోంది. ఎందుకో సునంద మనస్సు కీడును శంకించింది. అనుమాన నివృత్తి కోసం ఆమె మరోసారి ఆ వీధిని పరిశీలించి చూసింది. అది ఖచ్చితంగా తన ఇంటికి దారి కాదు. ఆ వీధికి తనింత వరకూ ఎప్పుడూ వచ్చి ఉండలేదు.

'ఇదుగో నువ్వు దారి తప్పావు -- రిక్షా ఆపు' అందామె. రిక్షా ఆగలేదు సరికదా జోరు హెచ్చింది. ఆమెకు విపరీతమైన భయం వేసింది. 'ఈ రిక్షా వాడెవరో - ఏం చేస్తాడో? సరదాపడి సినిమా కొస్తే ఇలా జరుగుతోందేమిటి?' అని ఆమె కంగారు పడసాగింది. ఆమె గుండె వేగంగా కొట్టుకోసాగింది. కాళ్ళు వణకసాగాయి. శరీరమంతా వేడెక్కిపోయింది.

'ఆపమంటుంటే నిన్ను కాదూ --ఆపవేం' అని అరిచింది.

రిక్షా వేగం తగ్గింది. ఇంతలో వెనక నుంచి వస్తున్న రిక్షా ఈ రిక్షాను దాటి ముందుకు వెళ్ళి ఆగింది. అందులోనించి ఒక యువకుడు దిగాడు. సునంద అతణ్ణి గుర్తు పట్టింది. సత్యానందం.

'ఇదే ఇల్లు -- ఇక్కడ ఆపు!' అన్నాడు సత్యానందం. సునంద రిక్షా ఆగింది.

జరగబోయేది సునందకు తెలిసింది. సినిమా జరుగుతుండగా సత్యానందం తన కోసం అన్ని ఏర్పాట్లూ ఇక్కడ చేసుకున్నాడు. ఓ రిక్షా వాడికి డబ్బాశ చూపించి తన్ను ఇక్కడికి తీసుకొచ్చాడు. తను వెనకనే అనుసరిస్తూ ఇక్కడికి వచ్చాడు. ఇప్పుడు ఆనాటి అవమానానికి పగ తీర్చుకుంటాడు. ఒక సినిమా కోసం -- తను -- సత్యాందం తెలివిగా వేసిన పథకంలో చిక్కుకుంది.

ఆమెకింక ఆలోచించడానికి వ్యవధి లేదు. మెరుపులా రిక్షా దిగి రోడ్డు ప్రక్కనే కనిపించిన సందులోకి పరుగెట్టింది. ఉలిక్కిపడిన సత్యానందం ఆమె వెనకే పరుగెత్తాడు. కానీ ఆమె ఆ సందులో ఎలా అదృశ్యమయిందో కానీ అతనికి కనబడలేదు. రిక్షా వాళ్ళ సహాయంతో అతడు ఆ సందంతా గాలించసాగాడు.

సునంద సందులోకి పరుగెత్తి ముందుకు వెళ్ళేసరికి ఆమెకు కుడివైపు నొక సందూ, ఎడమవైపు నొక సందూ కనిపించాయి. వెనకనే సత్యానందం పరుగెత్తుకొని వస్తున్నాడని గ్రహించిన సునంద కుడి పక్కకు తిరిగి పరుగెత్తినట్లు నటించింది కానీ, ఓ చెత్త కుండీ పక్కన జాగ్రత్తగా నక్కింది. చీకట్లో సత్యానందం కుడిపక్క సందులోకి పరుగెత్తగానే ఆమె చప్పుడు చేయకుండా ఎడమపక్క సందులోకి పరుగెత్తింది. అదృష్టవశాత్తూ ఆమెను ఎవరూ గమనించలేదు. ఆమె ఆ సందులోంచి మరో రెండు సందులు తిరిగి -- ఓ ఇంటి ముందు ఆగి తలుపులు తట్టింది.

అంత రాత్రి వేళ కూడా ఆ యింట్లో దీపం వెలుగుతోంది. అయినా తలుపు తీయడానికి సుమారు అయిదు నిముషాలు పట్టింది. తలుపు తీసిన ఓ ఆడమనిషి గుమ్మం ముందు నిలబడ్డ దేవకన్య వంటి సునందని చూసి ఉలిక్కిపడితే--తలుపు తీసింది. ఆడమనిషైనందుకు సునంద సంబరపడింది. కానీ ఆ ఆడమనిషి వేషభాషలు ఆమెకు నచ్చలేదు.

వయస్సులో వున్న ఆమె ఇంచుమించు అర్ధనగ్నంగా వుంది. వంటి మీద లంగా బాడీ తప్ప మరేమీ లేవు. అవయినా అస్తవ్యస్తంగా అప్పటికప్పుడు కట్టుకొచ్చినట్లనిపిస్తూంది. సునందకు కలిగిన ఆశ్చర్యం--ఆమె అటువంటి పరిస్థితిలో వున్నందుకు కాదు. అటువంటి పరిస్థితిలో తలుపు తీసినందుకు ఒకవేళ తలుపు తట్టినది మగవాడయుంటే...

ఆమె మరీ ఆలోచించకుండా చటుక్కున లోపల అడుగుపెట్టి--'సినిమాకని వచ్చాను. రిక్షావాడు మోసం చేసి ఇలా తీసుకొచ్చాడు. ఓ దుర్మార్గుడు నన్ను తరుముతున్నాడు. నేను పెళ్లయినదాన్ని. ఈ రాత్రికిక్కడ రక్షణ ఇప్పించగలిగితే మీ మేలు జన్మజన్మలకీ మరిచిపోలేను' అంది గబగబా.

ఆ మనిషి తలుపు వేసి--చిత్రంగా ఆమె వంక చూసి--'సరే. లోపలికి పదండి -ఎక్కడ మీ యిల్లు--' అనడిగింది. తన అడ్రస్ చెప్పింది సునంద. 'మిమ్మల్ని అన్యాయంగా చాలా దూరం తీసుకొచ్చారే! లక్ష్మీ టాకీస్ మీ ఇంటికెంత దూరమో. ఇక్కడికీ అంతే దూరం! తెల్లారేక వెలుదురుగాని--అందాకా ఆ గదిలో పడుకోండి!' అంటూ ఓ గది చూపించింది.

★ ★ ★

అదే రాత్రి మళ్లీ మరోసారి తలుపు తట్టిన చప్పుడు విని ఆ ఆడమనిషి మళ్లీ లేచి విసుగ్గా టైము చూసుకుంది. పావు తక్కువ ఒంటి గంటయింది.

తలుపు తీసేసరికి పూర్తిగా మైకంలోవున్న ఓ యువకుడు లోపలకు అడుగెట్టాడు. 'కాళీల్లేవు!' అందా ఆడమనిషి.

'అలాగంటే కుదరదు--అంతా అలాగే అంటున్నారు ఈవేళ'.

'మరి కాళీ లేందే--ఏం చేసేది?'

ఆ యువకుడు జేబులోంచి ఓ పచ్చ కాగితం తీశాడు-- 'చూస్కో--ఒక్క రాత్రికే ఇది నీ సొంతం!' అన్నాడు.

ఆ ఆడమనిషి ఒక్క క్షణం తటపటాయించింది. 'డబ్బు చేదా యేం నాకు? కానీ నిజంగానే కాళీ లేదు. కానీ ఎవరో వివాహితురాలు--రంభ లాగుంది--ఎవడో తరుముకు వస్తే ఇక్కడికి పరుగెత్తుకొచ్చింది. రాత్రికి పడుకుని ఉదయమే వెళ్లిపోతానంది-'

'అయితే ఇంకేం--'

'ఆగండి మరి--ఆవిడ నన్ను నమ్మింది--నమ్మక ద్రోహం చేయడం--..'

'ఈ నీతులెప్పట్నించి? అయినా వెతుక్కుంటూ సానివాడ కొచ్చిందంటే--బేరం కోసమే వచ్చిందేమోలే!'

'ఏమో బాబూ--'

'ఈ పచ్చ కాగితం నీదేనంటున్నాగా--'

ఆమె నోటు అందుకుని-- 'బాగా తాగి ఉన్నారు--జాగ్రత్తగా చూసుకోండి!' అంది.

ఎండ బాధ భరించలేని బట్టతల వాడొకడు తాడిచెట్టు క్రింద నీడ కోసం నుంచుంటే--అప్పుడే దాని పండొకటి తెగి వాడి నెత్తి మీద పడిందట.

ఆ యువకుడు సునంద గదిలో ప్రవేశించాడు.

★ ★ ★

ఎత్తయిన గట్టు మీద నిలబడి సునంద ఆలోచిస్తోంది.

తన జీవితమిలా ఎందుకయింది?

తను ఇంత కాలమూ సత్యానందాన్ని ఓ రాక్షసుడిగా భావించింది. కానీ రాక్షసత్వపుటనుభవం తనకు తెలియదు. అసలైన రాక్షసత్వం నిన్న రాత్రి ఆ వేశ్య ఇంట్లో గదిలో చూసింది తను. ఆ చీకటిలో ఒక అపరిచిత యువకుడు బలంగా తన్ను - అరవడానికి వీల్లేకుండా నోరు నొక్కి........

తనకు స్పృహ తప్పిపోయింది. జరగవలసింది జరిగిపోయింది. బహుశా సత్యానందమే అయుండాలి. మొత్తం మీద తన పగను సాధించుకున్నాడు. తన శరీరాన్ని మలినపరిచి ఆ దుర్మార్గుడు పారిపోయాడు!

అసలిలా ఎందుకు జరిగింది?

ఆ ప్రశ్నకు సమాధానం తెలియదు. కానీ మలినమైన ఈ జీవితాన్ని తనింక భరించలేదు. అమాయకుడైన తన భర్తను మోసగించి తమ బ్రతుకలేదు. కాని చనిపోయేముందు ఆ సత్యానందం మీద పగ తీర్చుకోవాలి-ఎలా?

సునంద నవ్వుకుంది. తన మరణానికి సత్యానందమే కారకుడనీ - వాడు శరీరాన్ని

భంగపరిచాడనీ ఉత్తరం రాసి సంతకం పెట్టి ఇంటి దగ్గర వదిలి వచ్చింది. తన భర్త ఆ ఉత్తరం చూసి ముందు బాధపడినా - తర్వాత సత్యానందం మీద పగబడతాడు. తను చెడి పోయిందని ఆయనకి తెలిసి ముందు బాధ పడినా తర్వాత తను ఎటువంటి రాక్షసత్వానికి బలయిపోయిందో గ్రహించి పగ తీర్చుకుంటాడు. అదే తనకు కావాలి?

అయినా తను ఇంకా ఎందుకు చావలేదు? సత్యానందం అనే విషోరగం తన్ను కాటు వేసింది. సర్పదష్టురాలయుండీ కూడా తనెందుకు చావలేదు?

సునందకు జవాబు దొరికింది. సత్యానందాన్ని తను నరనరాలా ద్వేషిస్తోంది. చివరికి వాడి చేతుల్లో తనకు అవమానం తప్పనిసరయినప్పుడు లొంగిపోతూనే - పగ ఎలా తీర్చుకోవాలా అని ఆలోచిస్తూనే ఉంది. ఆ పగ తీర్చుకోవాలనుకున్న కోరిక ఎంత బలమైనదంటే అది సత్యానందం విషానికి విరుగుడుగా పనిచేసింది. తను చావలేదు, ఇప్పుడు....

సత్యానందం చేసిన ఘాతుకం తన భర్తకు తెలియజేసింది. తను ఇంక జీవించవలసిన అవసరం లేదు.

క్రింద కదలాడుతున్న నీళ్ల వంకే చూస్తూన్న సునంద ఎవరిదో హస్తస్పర్శకు ఉలిక్కిపడి వెను దిరిగింది. కళ్ల నీళ్లతో రంగారావు!

భర్తను చూస్తూనే సునందకు దుఃఖం ఆగలేదు -- 'ఏమండీ!' అంటూ ముఖం చేతుల్లో కప్పుకుని ఏడ్చేసింది. అతను ఆమె పక్కనే కూర్చుని ఆమెను పొదివి పట్టుకున్నాడు.

'నేను నీ ఉత్తరం చదివాను రాణీ! నువ్వు చచ్చిపోతే నేను బ్రతకలేనని తెలిసుండీ - ఎందుకింత అఘాయిత్యానికి కొడిగట్టావు? నువ్వు కావాలని ఏ నేరమూ చేయలేదని నాకు తెలుసు. నిన్ను మనస్పూర్తిగా నా భార్యగా పూర్వంలాగే చూసుకుంటాను, జరిగింది మర్చిపోయి ఇంటి కొచ్చేసేయ్!'

సునంద తెల్లబోయింది. 'ఏమండీ -- మీరు మంచివారని తెలుసును కానీ మరీ ఇంత మంచితనం నేనూహించలేను. నేనా ఉత్తరం రాసింది మీకు నిజాన్ని తెలియబర్చడం కోసమేగానీ - మీ అంగీకారం కోసం కాదు. మలిన పడిన ఈ కట్టె ఇక జీవించడానికి వీల్లేదు. అందులోనూ మీ వంటి ఉత్తముడికి భార్యగా... అదెంత నరకమో మీ కర్థం కాదు!'

రంగారావు ఒక్క క్షణం ఆగాడు. తర్వాత నెమ్మదిగా అన్నాడు. 'నీ కోసం పరిగెత్తు కుంటూ వచ్చాను రాణీ! నువ్వు నా అదృష్టం కొద్దీ బ్రతికే ఉన్నావు. ఇక నువ్వు చావడానికి వీల్లేదు. నిన్ను చావనివ్వను, నువ్వు బ్రతికుండడానికి - నేను ఉత్తముడినవడమే అడ్డంగా ఉన్నట్లయితే నిజం చెబుతున్నాను - నేను ఉత్తముడిని కాదు - నాకు చెడు అలవాట్లున్నాయి-'

సునంద కంగారు పడింది. 'నా కోసం మీరు అబద్ధం చెప్పకండి - మీరు చెడ్డవారంటే నేను భరించలేను. నమ్మన్నేను. మీరు లక్ష సార్లు చెప్పినా మీకు చెడు అలవాట్లున్నాయంటే నేను నమ్మలేను'.

'నిజం రాణి - నేను చాలాసార్లు ఇంటికి ఆలస్యంగా రావడానికి అదే కారణం! నిన్న కూడా....' అన్నాడతను గంభీరంగా.

ఆమె వెంటనే నీళ్లలోకి దూకడానికి ప్రయత్నించగా అతను ఆపాడు.

'నన్నాపకండి! ఇంకాస్సేపుంటే మైలపడిన ఈ శరీరాన్ని రక్షించడం కోసం మీరింకా ఏయే అబద్ధాలు చెబుతారో - చనిపోయేటప్పుడైనా మీరు మంచివారనే తృప్తితో చనిపోతాను'

.

అతను ఆవేశంగా అన్నాడు. 'నీ శరీరం మైలపడలేదు రాణీ! రాత్రి రాక్షసత్వంతో నిన్ను అనుభవించింది పరాయివాడెవరూ కాదు, నీ భర్త రంగారావే!'

'ఏమండీ!' ఆమె గట్టిగా అరచింది. ఆమె గుండెలు విపరీతమైన వేగంతో కొట్టుకోసాగాయి. శరీరమంతా వణికిపోతోంది.

రంగారావు ఆవేశంగా చెప్పుకుపోతున్నాడు - 'నీ ప్రాణాలు నిలపడం కోసం నిజం చెబుతున్నాను. నేను సత్యానందం స్నేహం పట్టి చెడు అలవాట్లకి లోనయాను. అందుకే నీ మంచితనం చూసినప్పుడల్లా కంగారుగా ఉండేది. అయితే నీ మంచితనం నన్ను మార్చలేకపోయింది. అప్పుడప్పుడు ఆఫీసు పని వంకతో అక్కడక్కడ గడిపి వస్తూండేవాణ్ణి. నిన్న నిన్ను బలవంతంగా అనుభవించాక స్పృహ తప్పి పడిపోయిన నీ ముఖం వెలుతుర్లో చూసి గుర్తుపట్టి, భయం వేసి వెంటనే పారిపోయాను. ఆ రాక్షసుణ్ణి నేనేనని తెలియడానికి రెండు గుర్తులు చెబుతున్నాను విను....'

ఆ గుర్తులు వింటూనే ఆమె -- 'అయితే - నిన్న- మీరే...' అంది. తరవాత ఆమె నోట మాట రాలేదు.

'ఇప్పుడు చెప్పు రాణీ! మైలపడింది నువ్వా, నేనా? క్షమించవలసింది నువ్వా, నేనా? చనిపోవలసింది నువ్వా, నేనా?'

ఆమె మాట్లాడకపోవడం చూసి అతనామెను పరిశీలనగా చూశాడు.

తెరిచి ఉన్న ఆమె కళ్లు మూతపడలేదు. ఆమెలో చలనం లేదు. ఆమె శరీరంలో వేడి లేదు. ఆమె మరణించింది! 'సునందా!' అతను పిచ్చిగా అరిచాడు.

తను ఏ అవినీతినీ, రాక్షసత్వాన్నీ నరనరాలా ద్వేషించిందో ఆ అవినీతి, రాక్షసత్వాలతోనే రెండేళ్లపాటు కాపురం చేశానన్న నిజాన్ని భరించలేక ఆమె చనిపోయిందని రంగారావు గ్రహించాడు. తను మైలపడలేదన్న సంతృప్తికంటే తన భర్త రాక్షసుడన్న బాధ ఎక్కువై ఆమె మరణించింది.

కానీ రంగారావుకి తెలియని అసలు సంగతి -- సునంద సర్పదష్ట ! రంగారావు అనే సర్పం ఆమెను ఎన్నడో కరచింది. ఆ సంగతి తెలియని ఆమె సత్యానందం అనే సర్పానికి భయపడసాగింది. ఏ క్షణంలో అయితే రంగారావుని సర్పంగా ఆమె గుర్తించిందో ఆ క్షణంలోనే ఆ విషం పనిచేసింది. ఈసారి ఆమె వద్ద విరుగుడు లేదు. ★

*(ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక - 2-10-'70)*